

# ప్రజాజ్యోతి

## నల్లగొండ-సూర్యాపేట యాదాద్రి భువనగిరి

బుధవారం | 3 | ఏప్రిల్ | 2024 పేజీలు: 8

## పోలీసుల తనిఖీలలో నగదు పట్టివేత



కొండ మల్లేపల్లి, ఏప్రిల్ 02 ప్రజా జ్యోతి: పార్లమెంట్ ఎన్నికల్ల కోడ్ దృష్ట్యా కొండ మల్లేపల్లి పట్టణంలోని స్థానిక చౌరస్తాలో సిఐ ధనుంజయ గౌడ్, ఎస్ఐ రామ్మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో జడ్చర్ల నుండి కొండమల్లేపల్లికి వస్తున్న ఓ వ్యక్తి దగ్గర నుంచి సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న 1,50,000 నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఎఫ్ఎస్టి,ఎస్ఎస్టిటీంలో హాజరు కానీ వారిపై చర్యలు

**భాధ్యతయుతంగా విధులు నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు**



సూర్యాపేట జిల్లా లోని ఎఫ్ ఎస్ టి,ఎస్ ఎస్ టి కేంద్రాలను పరిశీలించటానికి అలాగే వాస్తవ పరిస్థితి ని జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక అందచేయుటకు ముగ్గురు జిల్లా స్థాయి అధికారులు నియమించటం జరిగిందని,కేంద్రాల్లో ఏమైనా లోపాలను గుర్తిస్తే అక్కడే ఆ కేంద్రంలో ఉన్న బృంద ప్రతినిధి కి నివృత్తి కై తెలియజేయటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు.అదేవిధంగా నియమించిన అధికారులు ఎఫ్ ఎస్ టి,ఎస్ ఎస్ టి కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు చేసి నివేదికలను అదనపు కలెక్టర్,ఆర్డీవో,డిఎస్పి లకు అందచేయాలని అలాగే మూడు విడతలలో పనిచేస్తున్న అధికారులు ఎవరైనా హాజరు కాకపోయినా,సరైన రీతిలో తనిఖీలు చేపట్టకపోయినా ఎన్నికల చట్టం ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.



రోజంతా హైడ్రేట్‌గా శీతలపానీయాలు వద్దు..

ఎండ సమయంలో పిల్లలను బయటకు అనుమతించవద్దు

చెరువులు, బావుల వద్దకు ఈతకు వెళుతుంటే జాగ్రత్త వహించండి

# వేసవికాలంలో ... పిల్లలు జరభద్రం!

నిడమానూరు,ఏప్రిల్ 02 (ప్రజాజ్యోతి):మనలో చాలా మందికి వేసవి అంటే పెరుగుతున్న ఉష్ణోగ్రత, వేడి దుమ్ముతో కూడిన గాలి, తేమ, వడదెబ్బ, అలెర్జీలు, ఇన్ఫెక్షన్లు , ఇతర వ్యాధులు.వీటన్నింటి మధ్య, పిల్లలను చూసుకోవడం ఒక సవాలుగా మారుతుంది. సాధారణంగా పిల్లలు వేసవి కాలంలోనే చాలా చురుకుగా ఉంటారు. ఎందుకంటే పాఠశాలలకు సెలవు దినాలు కావటంతో చదువులు, హోంవర్కులకు విరామం కలుగుతుంది. ఈ సమయాన్ని పిల్లలు ఆటపాటలకు ఉపయోగిస్తారు. స్నేహితులతో సరదాగా గడపాలని కోరుకుంటారు.ఇలాంటి సమయంలోనే వేడి, సూర్యుని ప్రతాపం, దుమ్ము , కాలుష్యం వంటి అన్ని రకాల బాహ్య మూలకాలకు పిల్లలు బహిర్గతం అవుతారు. వేసవిలో పిల్లల సంరక్షణ కోసం కొన్ని సులభమైన చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి. వేసవి కాలంలో పిల్లల విషయంలో తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిన ..మిగతా 2లో

## లోకసభ ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన**

2



## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్‌కు షాక్

**మాజీ ఎమ్మెల్యేను అడ్డుకున్న పోలీసులు**

**మాజీ ఎమ్మెల్యే ఇంటి ముందు కార్యకర్తలు ఆందోళన**



2



## లోకసభ ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన**

నల్లగొండ ఏప్రిల్ 02(ప్రజాజ్యోతి): ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఎలాంటి సమస్యలు రాకుండా లోకసభ ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు. మంగళవారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లోక సభ ఎన్నికల విధుల నిర్వహణకు నియమించబడిన ప్రిసైడింగ్ , సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఉద్దేశించి ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్నికలను సజావుగా నిర్వహించే కీలక బాధ్యత ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులపై ఉంటుందని, ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. శిక్షణ తీసుకుంటున్న ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఈవీఎం మిషిన్ల నిర్వహణ, వి వి పాట్ స్లిప్పుల లెక్కింపు విషయంలో జాగ్రత్తగా ఉండాలని, గత అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన అనుభవం ఉన్నప్పటికి ఈ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఇంకా చురుకుగా వ్యవహరించి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. అనంతరం స్థానిక నాగార్జున డిగ్రీ కళాశాల లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ ను పరిశీలించి,సీసీ కెమెరాలు, భద్రతపై నల్గొండ ఆర్డీవో కు పలు సూచనలు చేశారు. నాగార్జున కళాశాల మైదానంలో ఏర్పాటు చేయబోయే డీఆర్సీ సెంటర్ ని సైతం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నల్గొండ ఆర్డీవో రవి,ఎన్నికల శిక్షణా కార్యక్రమ నోడల్ ఆఫీసర్ వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, స్థానిక ఎమ్మార్వో ఎంఈఓ లు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# వేసవికాలంలో ... పిల్లలు జరభద్రం!



**మొదటి పేజీ తరువాయి...**

అవసరం ఉంది. ఎండవేడి కారణంగా చిన్నారులు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

**-రోజంతా హైడ్రేట్ గా**

అధిక వేడి వారిని అనారోగ్యం పాలు చేస్తుంది. శరీర ఉష్ణోగ్రతలు పెరగటం, నీరసం, వడబెబ్బకు గురికావటం వంటివి చోటు చేసుకుంటాయి. పిల్లలు రోజంతా హైడ్రేట్ గా ఉండేలా చూసుకోవాలి. ఏదో ఒకవిధంగా పిల్లలు ఆటలు మరియు అన్ని రకాల అవుట్‌డోర్ యాక్టివిటీల పట్ల ఆసక్తితో నీరును పెద్దగా సేవించరు. గంటల తరబడి దాహంతో ఉంటారు. దాహం చేసినప్పుడు నీరు సేవించటం వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్ స్థాయిని అలాగే ఉంచుతుంది. హైడ్రేట్ గా ఉండాలంటే కొబ్బరి నీరు, పండ్ల రసాలు, సిట్రస్ పండ్లు మరియు మజ్జిగ, నిమ్మకాయ నీరు మరియు పండ్ల స్మూతీస్ వంటి సులభంగా లభించే ఇతర ప్రత్యామ్నాయాలతో భర్తీ చేయవచ్చు.

**-శీతలపానీయాలు వద్దు ..**

అధిక ఉష్ణోగ్రత, కలుషితమైన నీరు, ఆహారం, వేడిని అధిగమించడానికి తీసుకునే శీతల పానీయాలు. ఇలా కారణం ఏదైనా వేసవి సమయంలో పిల్లలు తరచూ అనారోగ్యం పాలవుతారు. బయట వాతావరణం చాలా వేడిగా ఉండడం తద్వారా పిల్లల శరీర ఉష్ణోగ్రత పెరగడం, ఎక్కువ చెమటలతో శరీరంలో నీరు త్వరగా ఆవిరై వడదెబ్బకు దారితీస్తుంది. ఎండలో ఎక్కువసేపు గడిపితే అధిక చెమట ద్వారా లవణాలు కోల్పోయి నీరసించిపోతారు. ముఖ్యంగా ఇంట్లో ఉండే చిన్న పిల్లల విషయంలోనూ జాగ్రత్త అవసరం.

**-ఎండసమయంలో బయటకు అనుమతించకండి -**

ఉదయం,సాయంత్రం ఎండలేని సమయాల్లోనే పిల్లలను బయటికి అనుమతించటం శ్రేయస్కరం. ఎండ సమయంలో పిల్లలకి కథలు చెప్తూ, రైమ్స్,పాటలు పాడిస్తూ, పుస్తకాలు చదివిస్తూ, బొమ్మలు వేయిస్తూ, ఇంట్లో ఆడుకునే ఆటలు ఆడుకునేలా చూసుకోవాలి. కొబ్బరినీళ్లు, బార్లీ, సబ్జా, సగ్గుబియ్యం వంటి ద్రవాలు తాగించాలి. సీజనల్ ఫ్రూట్స్, అన్నీ రకాల ఆకుకూరలు, కూరగాయలు తినిపించాలి. పిల్లలకి రెండు పూటలు తప్పక గోరువెచ్చని నీటితో స్నానం చేయించాలి. శరీరంలో ఎక్కువ వేడి ఉన్నట్టయితే తడిబట్టతో తుడుస్తుండాలి.

**-ఇంట్లో చల్లని వాతావరణం ఉండేలా చూడాలి**

ఇంట్లోకి వేడిగాలి నేరుగా చొచ్చుకు రాకుండా చుట్టూ మ్యాట్ లు వేలాడదీయాలి. ఇవి పూర్తిగా తడి ఆరిపోకుండా చూసుకోవడం వల్ల గదులన్నీ చల్లని వాతావరణాన్ని కలిగి ఉంటాయి. పిల్లలకు పలుఛటి, మెత్తటి కాటన్ దుస్తులు వేయాలి. బయటికి వెళ్లాల్సివస్తే గొడుగు, టోపీ,తప్పకుండా ధరించాలి. దాహంతో సంబంధం లేకుండా మంచి నీరు వారికి అందించాలి. సాధ్యమైనంత వరకు నిలువ ఆహారం జోలికి పోకుండా తాజా ఆహారం మాత్రమే పెట్టాలి. వేసవి కాలంలో బ్రేక్‌ఫాస్ట్ తరువాత నిమ్మకాయ రసం, ఖర్జూరం పిల్లలకు ఇస్తే జీర్ణశక్తి పెరుగుతుంది.

**-తాజా ఆహారాన్ని అందించాలి**



వేసవి కాలంలో వండిన పదార్థాలు ఎండవేడికి త్వరగా చెడిపోతాయి. అలాగని ఫ్రిజ్ లో పెట్టుకుని తింటే, అధిక చల్లని పదార్థాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా పిల్లల్లో వాంతులు, విరేచనాలకు కారణం కావచ్చు. ఫ్రిజ్ ల్లో కూలింగ్ నీరు తాగడం వల్ల పిల్లలు వెంటనే జబ్బుల బారిన పడే అవకాశాలు ఉంటాయి. ఎండాకాలం వచ్చే వ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి. కళ్ళకలక, గవద బిళ్ళలు, టైఫాయిడ్, పొంగు, అతిసారా, కామెర్లు ఎక్కువగా వ్యాపిస్తాయి. ఈ వ్యాధుల విషయంలో అప్రమత్తగా ఉండాలి. పిల్లలు డీహైడ్రేషన్ కి లోనైనట్టు అనిపించినా ఉప్పు, పంచదార కలిపిన నీరు తాగించాలి.

**-చెరువుల,బావుల వద్దకు ఈతకు వెళుతుంటే**

చెరువులు,బావులకు సరదాగా ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలి. వేసవి కాలంలో పిల్లలను నీటికి దూరంగా ఉంచాలి. విద్యార్థులు స్నేహితులతో కలసి సరదాగా ఈతకు వెళ్తుంటారు. కొంత మంది పాత బావుల్లో కూడ ఈతకు వెళతారు. ఇలాంటి సమయంలో కొన్ని ప్రమాదాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలు ఈత కోట్టే ముందు పిల్లల పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారులను నీటికి దూరంగా ఉంచడమే మంచిదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**-వాహనాలతో రోడ్లపైకి**

పిల్లలకు కార్లు, ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ఇంట్లో ఎవరికి చెప్పకుండా వాటిని నడిపేందుకు రోడ్డెక్కి ప్రమాదాల భారిన పడాల్సి వస్తుంది. అవసమైతే పెద్దల సమక్షంలో నడిపైలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువ. ఏది ఏమైనా వేసవి సెలవుల్లో చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్‌కు షాక్

**మాజీ ఎమ్మెల్యేను అడ్డుకున్న పోలీసులు**

**మాజీ ఎమ్మెల్యే ఇంటి ముందు కార్యకర్తలు ఆందోళన**

హాలియా, నిడమనూరు ఏప్రిల్ 2(ప్రజా జ్యోతి) : నాగార్జునసాగర్ నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ నివాసం ఉంటున్న ఈ 19 నెంబర్ గల ఇంటిని మంగళవారం సాయంత్రం నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులు ఇంటిని స్వాధీనం చేసుకుని సీల్ వేశారు. ఈ సంఘటనలో రెవెన్యూ, పోలీస్, ఎన్ఎస్పి అధికారులు మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాసరావు, పెద్దవూర తహసిల్దార్ పావని సరోజ,ఆర్ ఐ శ్రీనివాస్ రెడ్డి, సాగర్ సిఐ బీసన్న,ఎస్సై సంపత్ గౌడ్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎఈ బిక్షమయ్య ఆధ్వర్యంలో సదరు ఇంటిలోని వస్తువులను నందికొండ మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో ఎన్ఎస్పి స్టోర్ రూమ్ కు తరలించి నివాసం దర్వాజకు, బయట గేటుకు కూడా సీల్ వేశారు.

ఈ విషయంలో సాగర్ డ్యాం ఈఈ మల్లికార్జున రావును వివరణ కోరగా బీఆర్ఎస్ మాజీ శాసనసభ్యులు సాగర్ లో హిల్ కాలనీలో నివాసం ఉన్న ఇల్లు మాజీ శాసనసభ్యులు నోముల నర్సింహయ్య ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ పేరు మీద ఆ ఇంటిని అలాట్మెంట్ చేసుకున్నారని దానిపై ప్రభుత్వ నిధులతో మరమ్మత్తులు కూడా చేయించారన్నారు. ప్రస్తుతం శాసనసభ్యులు గా కాంగ్రెస్ పార్టీ ఎన్నికైన తర్వాత ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ అయినా ఆ నివాసాన్ని కాంగ్రెస్ శాసనసభ్యులకు అప్పగించాల్సి ఉంది అన్నారు. ఈ విషయంలో పరిసార్లు నోటిసులు అందజేసిన స్వయంగా మాట్లాడిన స్పందించలేదన్నారు.



దీంతో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం మంగళవారం నాడు ఆ నివాసాన్ని దానిలోని సామాగ్రిని తరలించి సీలు వేసి రెవెన్యూ పోలీస్ అధికారుల సహకారంతో స్వాధీనం చేస్తున్నామని అన్నారు. గతంలో నాగార్జునసాగర్ శాసనసభ్యులుగా సేవలందించిన శాసనసభ్యులు నివాసాన్ని మీడియాకు ఎటువంటి సమాచారం లేకుండా ఇంటిలోని సామాన్లను తరలించి సీల్ వేయడం తరలించి సీల్ వేయడం గమనార్హం.

ఈ విషయంలో మాజీ శాసనసభ్యులు బీఆర్ఎస్ సాగర్ నియోజకవర్గ



ఇన్చార్జ్ నోముల భగత్ కుమార్ ను వివరణ కోరగా సాగర్ లో తాను నివాసం ఉన్న ఇంటిని తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా అక్రమంగా ఎన్ఎస్పి అధికారులు రెవెన్యూ, పోలీస్ అధికారుల సహకారంతో స్వాధీనం చేసుకోవడం అన్యాయమన్నారు. ఈ విషయంలో ఆందోళన నిర్వహించి న్యాయపరంగా పోరాటం చేస్తామని అన్నారు.

**బీఆర్ఎస్ కార్యకర్తలు నివాసం ముందు ఆందోళన**

నాగార్జునసాగర్ నందికొండ మున్సిపాలిటీలోని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ నివాసం దగ్గర కార్యకర్తలు ధర్నా చేపట్టారు.

## కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి గెలుపు కోసం

# బహుజనులు ముందుండాలి

**జాతిని అడ్డం పెట్టుకొని బిజెపికి వత్తాసు పలుకుతున్న మందకృష్ణ కు తగదు**

**టి ఎంఆర్పిఎస్, ఎస్ టి ఆర్ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోకల కిరణ్ మాదిగ**



దామరచర్ల,ఏప్రిల్ 02, ( ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గత 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జాతి పేరును అడ్డంపెట్టుకుని వర్గీకరణ అంశాన్ని లేవనెత్తి మాదిగలను మోసం చేయడం తగదని,బిజెపి పార్టీకి వత్తాసు పలకడం దేనికి సంకేతం అని టిఎంఆర్పిఎస్,ఎస్టిఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పోకల కిరణ్ మాదిగ ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారాన్ని ఉద్దేశించి టిఎంఆర్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేపల్లి ఉదయ్ కుమార్ మాదిగ,టిఎంఆర్పిఎస్ రాష్ట్ర యూత్ అధ్యక్షులు పోకల రవి మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలో జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో పోకల కిరణ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ అదాని, అంబానీలను పెంచి పోషిస్తుందని దేశంలోనే బహుజన అణగారిన కులాలకు రాజ్యాధికారాన్ని దూరం చేస్తూ వివక్షతకు గురిచేశారన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మాదిగ ఉప కులాలను అడ్డం పెట్టుకొని ప్రతి ఎన్నికల్లో ప్యాకేజీ సంఘంగా ఎమ్మార్పీఎస్ మారిందన్నారు.మాజీ మంత్రి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత కుందూరు జానారెడ్డి తనయుడు నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి కి దామరచర్ల మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో భారీ మెజార్టీ వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.తెలంగాణ రాష్ట్రం ను ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే విధంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని వచ్చే ఎంపీ ఎన్నికలకు బహుజనులు సిద్ధమై బిజెపి పార్టీని ఎండగట్టాలని, కాంగ్రెస్కు పట్టం కట్టాలని కోరారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాదిగలు కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని బహుజనుల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు ధీరవత్ మోహన్ నాయక్,బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పొదిల శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకారపు గోపాల్, అలంపల్లి వసంత్, నాగు నాయక్,జాను నాయక్, దేవుండ్ల నాగయ్య,గుడి కుంట్ల రాజు, చింతపాకల రవి, రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## వద్దడెబ్బపై అవగాహణ కార్యక్రమం

తిరుమలగిరి ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి): తిరుమలగిరి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం యందు అరోగ్య సిబ్బందికి, ఆశ కార్యకర్తలకు వడదెబ్బ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మల్లెల వందన మాట్లాడుతూ ఈ వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నందున ఆశ కార్యకర్తలు మరియు అరోగ్య సిబ్బంది ప్రజలకు వడదెబ్బ లక్షణాలు, జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి గ్రామంలో %ూ=ూ% డిపో హెూల్డర్స్ ఎర్పాటు చేయడం జరిగిందనీ %ూ=ూ% ప్యాకెట్లు అందుబాటులో ఏర్పాటు చేయడం జరిగింది తెలిపారు. ఉదయం 10 సాయంత్రం 4 గంటల లోపు పనికీ వెళ్ళాలని, అత్యవసం సమయంలో పనికీ వెళితే తరుచుగా



మంచినీళ్ల త్రాగలని, తెల్లని కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే అరోగ్య సిబ్బందినీ సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాలోతు బిచ్చునాయక్, సూపర్ వైజర్ స్వరూప కుమారి, పల్లె దవాఖానా డాక్టర్లు, అరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



## బార్ అసోసియేషన్ అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రామిరెడ్డి**

హుజూర్ నగర్, ఏప్రిల్ 2 (ప్రజా జ్యోతి): బార్ అసోసియేషన్ అభివృద్ధి కొరకు శక్తివంచన లేకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అలాగే న్యాయవాదులు తమ కార్యవర్గానికి పూర్తి సహకారాన్ని అందించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రామిరెడ్డి న్యాయవాదులను కోరారు. మంగళవారం నూతనంగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడుగా, కోశాధికారిగా ఎన్నికైన జక్కుల నాగేశ్వరరావు, బానోతు సురేష్ కుమార్ లను బార్ అసోసియేషన్ హాల్ నందు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామి రెడ్డి మాట్లాడుతూ హుజూర్ నగర్ లో న్యాయస్థానాల పెంపు, న్యాయస్థానాలలో తగిన మౌలిక వసతుల కల్పన, సిబ్బందిని సమకూర్చటం, న్యాయవాదుల సంక్షేమానికి తమ కార్యవర్గం చిత్తశుద్ధితో పనిచేస్తుందని న్యాయవాదులకు హామీ ఇచ్చారు. న్యాయవాదులకు ఎప్పుడు ఎవరికి ఏ అవసరం వచ్చిన తాను ఎల్లవేళలా అందుబాటులో ఉండి న్యాయవాదుల పక్షాన నిలబడి కొట్లాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జక్కుల వీరయ్య, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, నట్టే సత్యనారాయణ, అంబటి శ్రీనివాసరెడ్డి, చనగాని యాదగిరి, నాగేష్ రాథోడ్, రవికుమార్, రామ లక్ష్మారెడ్డి, నారాయణరెడ్డి, వట్టికూటి అంజయ్య, ఎం.ఎస్ రాఘవరావు, సైదా హుస్సేన్, పసుపులేటి వీరు, మద్దుల నాగేశ్వరరావు, జుట్టుకొండ సత్యనారాయణ, లతీఫ్, క్రాంతి, ప్రదీప్తి, రేణుకాదేవి, రమాదేవి, రమణారెడ్డి, చక్రాల వెంకటేశ్వర్లు, గొట్టే ప్రశాంత్ బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## సారా నిర్మూలనకై ప్రత్యేక డ్రైవ్

**23 లీటర్ల సారాతో పాటు 300 కిలోల బెల్లం స్వాధీనం**



హుజూర్ నగర్, ఏప్రిల్ 2 (ప్రజా జ్యోతి): లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో సారా నిర్మూలన కై ఎక్సయిజ్ శాఖ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి ఆదేశాల మేరకే సూర్యాపేట జిల్లా ఎక్సయిజ్ అధికారి లక్ష్మనాయక్ ఆధ్వర్యంలో మంగళవారం హుజుర్ నగర్ నియోజకవర్గ పరిధిలోని మట్టంపల్లి, చింతలపాలెం, మెల్లచెర్వు మండలాలలోని పలు గ్రామాల్లో నల్గొండ ఎక్సయిజ్ ఎన్ఫోర్స్మెంట్, సూర్యాపేట డి.టి.ఎఫ్, కోదాడ స్టేషన్ తో పాటు హుజూర్ నగర్ ఎక్సయిజ్ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 23 లీటర్ల సారాతో పాటు 300 కిలోల బెల్లం ను స్వాధీనం చేసుకోని, ఒక వాహనంను సీజ్ చేసినట్లు తెలిపారు.ఎర్రకుంట తండాకు చెందిన బానోతు శ్రీను ల నుండి 5 లీటర్లు, బాణోత్ హనుమ నుండి 3 లీటర్లు సారా స్వాధీనం చింతలపాలెం మండల కేంద్రంలో 300 కిలోల బెల్లం ను సీజ్ చేయడమైనది. ఆ ఇంటి వ్యక్తి పరారీ లో వున్నాడనీ అదే గ్రామానికి చెందిన చిత్తలూరి లక్మి సారా విక్రయిస్తుండగా ఆమె వద్ద నుండి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడమైనది. ఆమె పై కేస్ నమోదు చేయడమైనది. మట్టంపల్లి మండలంలో అవిరేణి కుంట తండా, సుల్తానాపూర్ తండా, రామచంద్ర పురం తండా శివార్లలో దాచి ఉంచిన సుమారు 900 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేయడమైనది.

**ఒక ద్వి చక్ర వాహనం పట్టివేత**

మట్టంపల్లి మండలం కాల్వపల్లి తండాకు చెందిన బానోతు కోట, బాణోత్ సోముడు చౌటుపల్లి గ్రామానికి 10 లీటర్ల సారా తరలిస్తున్న క్రమంలో కోటా హెూండా షైన్ వాహనంను సీజ్ చేయడమైనది. బానోతు సోముడు పరారీ కాగా ఇరువురు పై కేస్ నమోదు చేయడమైనదనీ తెలిపారు.

ఈ దాడులలో జిల్లా ఎక్సయిజ్ అధికారి శ్రీ లక్ష్మ నాయక్ తో పాటు, సీఐలు రాకేష్, మల్లయ్య, శంకర్ జగన్ మోహన్ రెడ్డి రవి , నరేష్, నాగరాజ్, రుక్మ రెడ్డి, దనుంజయ్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## లిఫ్టుల ద్వారా చెరువులు కుంటలు నింపాలి



మునగాల ఏప్రిల్ 02 (ప్రజా జ్యోతి): మునగాల మండలం కొక్కిరేణి గ్రామంలో సిపిఎం పార్టీ గ్రామ శాఖ సమావేశం జరిగింది. ఈ యొక్క సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెదరమెట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సాగర్ ఎడమ కాలువనీటి ద్వారా చెరువులు, కుంటలు నింపాలని, వర్షాబావ పరిస్థితుల వల్ల చెరువుల్లో కుంటల్లో నీళ్లు లేక భూగర్భ జలాలు అడుగంటి పోయి గ్రామాలలో త్రాగునీటి సమస్య నెలకొని ప్రజలకు చాలా తీవ్రమైన నీటి కొరత ఏర్పడిందని ఆయన అన్నారు.. ఈ యొక్క సమావేశంలో సిపిఎం కార్యదర్శి నందిగామ సైదులు. సీనియర్ నాయకులు పొటు పుల్లయ్య. సింగిల్ విండో డైరెక్టర్ నిడిగొండ శంబయ్య మాజీ ఉపసర్పంచ్ రావులపెంట బ్రహ్మం ములకలపల్లి సైదులు. నాగరాజు ప్రసాద్ ముంత రాములు మామిడి లింగయ్య అంజయ్య తదితరులు పాల్గొన్నారు...

## ఆలేరులో ధాన్యం కొనుగోలు ప్రారంభం

**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడిఏ వెంకటేశ్వరరావు**



ఆలేరు, ఏప్రిల్ 2, (ప్రజాజ్యోతి): ఆలేరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏడిఏ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మంగళవారం ఆలేరు వ్యవసాయ మార్కెట్ లో ఎఫ్ పి ఓ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, టంగుటూరు గ్రామంలో వ్యాపన ఎఫ్ పి ఓ ఆధ్వర్యంలో నడిచే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు తెచ్చిన ధాన్యానికి ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర పొందాలని అన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చెయ్యాలని, రైతులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అవసరమైన సమాచారం వారికి అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీప్తి, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి పద్మజ, సహాయ మార్కెట్ కార్యదర్శి దివ్య, ఏఈవోలు రాకేష్, శివకుమార్, మార్కెట్ సూపర్వైజర్ శ్రీనివాస్, మార్కెట్ సిబ్బంది, ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహకులు స్వామి, సుధీర్, శ్రీనివాస్, ప్రశాంత్, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.



# ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వహించాలి

**శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి**
**ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వర్తించాలి...ఎడిషనల్ కలెక్టర్ ప్రియాంక**



కోదాడ టౌన్ ఏప్రిల్ 2( ప్రజా జ్యోతి): ఎన్నికల విధులు సమర్ధవంతంగా పారదర్శకంగా నిర్వర్తించాలని సూర్యపేట జిల్లా ఎడిషనల్ కలెక్టర్ ప్రియాంక అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని సనా ఇంజనీరింగ్ కళాశాలలో మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు ప్రిసీడింగ్ సహాయ ప్రిసీడింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పొరపాట్లు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు శిక్షణను పూర్తిగా అవగాహన చేసుకుని ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై పూర్తి అవగాహన పొందాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కొరకు ఫారం 12 పూర్తిచేసి రెవెన్యూ సిబ్బందికి అందజేయాలన్నారు. ఎన్నికల శిక్షణకు లో అందజేసిన నిబంధనల సూచనలను పూర్తిగా అధ్యయనం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఆర్డీఓ సిహెచ్ సూర్యనారాయణ, తహసిల్దార్ సాయి గౌడ మండల విద్యాధికారి సలీం షరీఫ్, ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్ అనిల్ సంధ్యారాణి,ఆర్.ఐ లురాజేష్, సుజిత్, ఎస్.ఎల్.ఎమ్‌టీలు విప్పర్ల రమేష్, చందా శ్రీనివాసరావు, ఏఎల్. ఎమ్ టీలు యం. డి హమీద్, వస్కుల రామారావు, డి.వెంకటేశ్వర్లు, తల్లడా శ్రీనివాసరావు, బొల్లికొండ కోటయ్య, పి శ్రీనివాస్ రెడ్డి రెవిన్యూ సిబ్బంది, పలు మండలాల పీఆర్.వోలు ఏపీ ఆర్ వోలు పాల్గొన్నారు.

# కైలాసపురంలో అన్నపూజ

**భక్తులకు అన్నదానం చేస్తున్న వంగపల్లి అంజయ్య స్వామి**

ఆలేరు, ఏప్రిల్ 2, (ప్రజాజ్యోతి): కైలాసపురం శ్రీ రేణుక బసవ లింగేశ్వర ఆలయంలో మంగళవారం అన్న పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఏడు రోజులపాటు దేశంలోని 14 పుణ్యక్షేత్రాలను సందర్శించి అక్కడి ప్రసాదాన్ని భక్తులకు అన్న పూజా కార్యక్రమంలో భాగంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య సంఘం రాజపేట మండల అధ్యక్షుడు ఉప్పల రమేష్ గుప్త, హెచ్ఎంటీవీ ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి గుండు మహేందర్, ఎస్ ఎన్ ఛానల్ ఎండి చామ శ్రీధర్ దంపతులు, మల్లిగారి శ్రీనివాస్ దంపతులు, పొద్దుటూరి రమేష్, జై ని శ్రీనివాస్ దంపతులు, సిద్ధి శ్రీనివాస్, పల్లెర్ల సంతు, ప్రభాకర్, ఆలేరు వాసవి క్లబ్ అధ్యక్షుడు సముద్రాల రవి, ఆర్యవైశ్య నాయకులు లంకలపల్లి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.



# సీపీఎం అభ్యర్థి యండి.జహంగీర్‌ను ఆశీర్వదించండి

**నియోజకవర్గం సమావేశంను జయప్రదం చేయండి**
**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా**

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 02 (ప్రజాజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈనెల 5వ తేదీన భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి యండి. జహంగీర్ గెలుపు కోసం నిర్వహిస్తున్న సిపిఎం భువనగిరి నియోజకవర్గం సమావేశంలో పార్టీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ కోరారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాదం విష్ణు అధ్యక్షతన సమావేశానికి ముఖ్య అతిథులుగా నర్సింహ్మా పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రాంతము అన్ని రంగాల్లో అభివృద్ధి కావాలంటే ప్రశ్నించే గొంతు పోరాడే నాయకుడు సిపిఎం అభ్యర్థి యండి.జహంగీర్ ను గెలిపించాలని నర్సింహ్మా పిలుపు ఇచ్చారు. భువనగిరిలో జరుగు నియోజకవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ , సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ , సిపిఎం జిల్లా కార్యదర్శి పార్లమెంటు అభ్యర్థి యండి.జహంగీర్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కోట రామచంద్రారెడ్డి, మంచాల మధు, మండల కమిటీ సభ్యులు నెలకంటి జంగయ్య, నోముల కృష్ణారెడ్డి, కలుకూరు బిక్షపతి, సిలువేరులాలయ, పట్టణ కమిటీ సభ్యులు దుబ్బాక జగన్, బుగ్గ లక్ష్మయ్య, శాఖ కార్యదర్శులు వారాల మల్లారెడ్డి, నాయకులు గూడూరు కృష్ణ రెడ్డి, బోయపల్లి పురుషోత్తమ రెడ్డి, బొల్లి సుగుణమ్మ, నెలకంటి నిర్మల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూదాన్ పోచంపల్లి పట్టణ నాయకులు వడ్డేపల్లి యాదగిరి సిపిఎంలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

**డిఆర్డిఏ పిడి మధుసూధన్ రాజు**



పెన్ పహాడ్ ప్రతినిధి ఏప్రిల్ 2 (ప్రజా జ్యోతి): మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామంలో సెర్ఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం డిఆర్డిఏ పిడి మధుసూధన్ రాజు తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రైతులతో మాట్లాడుతూ పండించిన వరి ధాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద రైతులందరూ విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద తరుగు రూపంలో రైతులను మోసం చేయవద్దని అన్నారు. అధికారులు రైతులపై పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అజయ్ నాయక్, సీసీ చెన్నయ్య, విఓఏ విజయ, నిర్వాహకులు నీరజ, ఇందిరమ్మ, సుమతి, తదితరులు పాల్గొన్నారు.



# సాగర్ నీటితో చెరువులు కుంటలు నింపాలి

**గంధం సైదులు**
**సామాజిక కార్యకర్త**

మునగాల ఏప్రిల్ 02 (ప్రజా జ్యోతి): ఏడాది వర్షాభావ పరిస్థితులు సరిగా లేనందున మండలంలోని అనేక గ్రామాలలో నీటి కొరత ఉన్నందున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసిన సందర్భంగా మునగాల మండలంలోని అన్ని గ్రామాల చెరువు కుంటలను నింపాలని మునగాల మండలానికి చెందిన సామాజిక కార్యకర్త గంధం సైదులు మునగాల మండల ఎమ్మార్వో వి ఆంజనేయులు కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొరివి వీరభద్రరావు, యుగంధర్ రెడ్డి లు పాల్గొన్నారు.



# బిజెపి ఆధ్వర్యంలో సర్దార్ పాపన్న గౌడ్ వర్ధంతి

**పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు**

ఆలేరు, ఏప్రిల్ 2, (ప్రజాజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314 వ వర్ధంతి పురస్కరించుకొని బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు అసెంబ్లీ బిజెపి కన్వీనర్ చిరిగే శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నందా గంగేష్, ప్రధాన కార్యదర్శిలు వడ్డేమాన్ నరేందర్, కళ్లెం రాజు, ఓ బి సి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కామిటికారి కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి తునికి దశరథ, ఉపాధ్యక్షులు బోడ పట్ల రాజశేఖర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు పూల హనుమంతు, పట్టణ మాజీ అధ్యక్షుడు బడుగు జహంగీర్, ఆయిలీ సందీప్, సుంకరి సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

**మండల ప్రత్యేక అధికారి శిరీష**

మునగాల ఏప్రిల్ 02 (ప్రజా జ్యోతి): మునగాల మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని దానికి తగ్గట్టుగా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని మునగాల మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న మునగాల మండల ప్రత్యేక అధికారి శిరీష ఆయా గ్రామాల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మునగాల మండల ఎమ్మార్వో వి ఆంజనేయులు ఎండిఓ రమేష్ దీన్ దయాల్ ఎంపీడీవో భూపాల్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అశ్రునయనాల మధ్య 'దాసి' సుదర్శన్ అంత్యక్రియలు

**జాతీయ అవార్డు గ్రహీత కి పలువురి సంతాపం**



మిర్యాలగూడ,ఏప్రిల్ 02,( ప్రజా జ్యోతి ): జాతీయ అవార్డు గ్రహీత, జర్నలిస్ట్, ఆర్టిస్ట్, కార్టూనిస్టు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ సంఘాల నేత 'దాసి' సుదర్శన్ అంత్యక్రియలు అభిమానులు, కళాకారులు,సాహితి వేత్తల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు మంగళవారం జరిగాయి. సోమవారం మధ్యాహ్నం కన్ను మూసిన సుదర్శన్ పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం ఆయన ఇంట్లో ఉంచారు మధ్యాహ్నం పార్థివా దేహాన్ని సీతారాంపురంలోని ఆయన నివాసం నుండి ఊరేగింపుగా తాళ్లగడ్డ స్మశానవాటికకు తరలించి అంతిమ క్రియలు నిర్వహించారు.

పలువురి నివాళి:- ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన వారిలో సాహితీ వేత్త వేణు సంకోజు, మానవ హక్కుల నేత పి.సుబ్బారావు, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య, మనోజ్, రాముడు శర్మ, దేగ వీటి, కిరణ్మయి, పోస్టల్ రామయ్య, టిటిఎఫ్ కన్వీనర్ కస్తూరి ప్రభాకర్, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత జ్వాలా వెంకటేశ్వర్లు, ప్రముఖ కార్టూనిస్టులు, ఆర్టిస్టులు శంకర్, చిత్ర, నర్సిం, విజయ్, రిటైర్డ్ రెవిన్యూ ఉద్యోగి చెన్నూరు రంగారావు, కౌన్సిలర్ పందిరి అనిత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, నాయకులు పందిరి కృష్ణ, మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, చీదళ్ళ యాదయ్య, మిర్యాలగూడ జర్నలిస్టుల సంఘాల నాయకులుఎంఎన్.రెడ్డి, ఖాజా హామీదుద్దీన్, జివెంకన్న, మనోజ్, ఎస్కె అయూబ్, ఖాజా నాజీమోద్దీన్, కె. నాగయ్య, కె.నాగాచారీ, రాచకొండ రమేష్, కిషోర్,రాంప్రసాద్,రమేష్, మంద సైదులు, జంగా లక్ష్మణ్ యాదవ్, రంగా శ్రీనివాస్,సంతాపం తెలిపారు.

**మాజీ ఎమ్మెల్యే జూలకంటి సంతాపం**

దాసి సుదర్శన్ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సంతాపం ప్రకటించారు. సుదర్శన్ సాహితీవేత్తగా, రచయితగా నిబద్ధత తో పేద ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేశారని కొనియడారు. జర్నలిస్టుగా సమస్యలను వెలుగులోకి తెచ్చి వాటి పరిష్కారం కోసం పాటుపడ్డారన్నారు. ఆయన మృతి సమాజానికి తీరనిలోటు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## ఘనంగా స్మార్ట్ కిండర్ స్టార్స్ పాఠశాల మొదటి వార్షికోత్సవ సంబరాలు

కొండ మల్లేపల్లి, ఏప్రిల్ 02 ప్రజా జ్యోతి:: కొండమల్లేపల్లి పట్టణంలోని స్మార్ట్ కిండర్ ప్లే స్కూల్ లో మొదటి వార్షికోత్సవం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఎంతో ఉత్సాహంగా మంగళవారం సాయంత్రం జరిగింది. పాఠశాల విద్యార్థులు వివిధ రకాల డాన్సులు, పాటలతో, వివిధరకాల వేషాధరణాలతో అలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ యేకుల అనిత కుమారి మాట్లాడుతూ పాఠశాల మొద టి వార్షికోత్సవం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పిల్లలు ఇలాంటి కార్యక్రమాలతో ఎంతో చురుకుగా తయారవుతారని మరియు మానసిక పునరుత్తేజాని కల్గిస్తాయి అని అన్నారు. తమ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ, ఎల్‌కేజి నుండి ఐదో తరగతి వరకు తరగతులను నిర్వహిస్తాం వారు అన్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇలా వార్షికోత్సవ వేడుకలు పాఠశాల యాజమాన్యం నిర్వహించడం వల్లన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రిటైర్డ్ యంఇవో యేకుల సామేలు, రిటైర్డ్ డిగ్రీ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ యేకుల రాజారావు మరియు స్కూల్ డైరెక్టర్లు యేకుల సురేష్, రత్నం బాబు, ఉపాధ్యాయులు లక్ష్మి, శాహినాజ్, పాఠశాల ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



## శ్రామికుల రాజ్యం వచ్చినప్పుడే సర్వాయి పాపన్నకు నిజమైన నివాళి

**సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళు లర్పిస్తున్న నాయకులు**



ఆలేరు, ఏప్రిల్ 2, (ప్రజాజ్యోతి): శ్రామికుల రాజ్యం వచ్చినప్పుడే సర్వాయి పాపన్నకు నిజమైన నివాళి అని కేజీకేఎస్ రాష్ట్ర నాయకులు ధూపాటి వెంకటేశ్వర్లు, పిఎసిఎస్ మాజీ జిల్లా నాయకులు మొరిగాడి చంద్రశేఖర్ లు అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న 314 వ వర్ధంతి పురస్కరించుకొని మంగళవారం ఆలేరు పట్టణంలోని బస్టాండ్ సమీపంలోనున్న పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాపన్న చిన్న వయసులోనే తండ్రి మరణించిన తాను కుటుంబ భారం మోస్తూ ముస్తాది కట్టి తాటి చెట్టు ఎక్కి కళ్ళు అమ్ముకుంటూ తన తల్లి సర్వమ్మ తో జీవన గడిపేడ వాడని, బడుగు బలహీన వర్గాలను ఇబ్బందులకు గురి చేస్తున్న మొగల్ సైనికుల దాష్టికాలను చూసి సహించలేక చిన్న వయసులోనే వారికి ఎదురు నిలిచి పోరాటాలు చేశాడని తెలిపారు. అన్ని సామాజిక వర్గాల నుండి 12 మంది నాయకులు ఎంచుకుని వారి ద్వారా 12 000 సైన్యాన్ని ఏర్పాటు చేసి నిజం సైనికులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి రాజ్యాధికారాన్ని సాధించిన ఘనత పాపన్నకే దక్కిందని అన్నారు. పాపన్న ఆశయాలను సాధించాలని అనుకోవడం కాదు ఇప్పుడు సమాజంలో జరుగుతున్న అన్యాయాలను అధ్యయనం చేసి ఆచరణలో ఉన్నప్పుడే ఆయనకు ఘనమైన నివాళి అని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా వాటి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుడు మొరిగాడి రమేష్, గన గాని మల్లేష్, భాగయ్య, మల్లేష్, మొరిగాడి అశోక్, మొరిగాడి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో బిక్షం 17వ వర్ధంతి

**బిక్షం అన్న స్మారక స్తూపం వద్ద నివాళు లర్పిస్తున్న రాచకొండ జనార్ధన్.**

ఆలేరు, ఏప్రిల్ 2,(ప్రజాజ్యోతి): సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో కామ్రేడ్ ఇరుగదిండ్ల బిక్షం అన్న 13వ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచకొండ జనార్ధన్ చెప్పు పుష్పగుచ్చాలతో ఆయనకు ఘనంగా విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవం పట్ల, విప్లవ రాజకీయాల పట్ల ఎంతో గౌరవంగా నమ్మకంగా ఉండే బిక్షం అన్న పార్టీని ముందుకు తీసుకుపోయే క్రమంలో ఆయన ప్రాణ త్యాగం చేశాడని అన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపుతో అనేక కార్యక్రమాలు చేపట్టి తోటి కామ్రేడ్స్ కు ఆదర్శంగా నిలిచిన కామ్రేడ్ బిక్షం అన్న గుండె ధైర్యం గల కార్యకర్త అని, ఆలేరు సబ్ డివిజన్ నాయకునిగా ప్రజల కోసం పనిచేశారని, కామ్రేడ్ బిక్షం అన్న ధైర్యాన్ని చూసిన ప్రజలు ఆయనను గుండెకాయల బిక్షమన్న అని పిలిచే వారిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ సీత, ఐఎఫ్టియు జిల్లా నాయకుడు కామ్రేడ్ కుర్రి మార్కండేయ, తమ్మడి రమేష్, కొమ్మిడి గోపాల్ రెడ్డి, బైరి చంద్రయ్య తదితరులు ఉన్నారు.



## ప్రపంచస్థాయి ఆర్ట్ కాంపిటీషన్లో ప్రథమ బహుమతి పొందిన గట్టు శశి మేఘన్

**అభినందించిన పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు.**



మునగాల ఏప్రిల్ 2 (ప్రజా జ్యోతి): మునగాల మండల కేంద్రానికి చెందిన గట్టు గురుమూర్తి చంద్రకళల కుమారుడు గట్టు శశి మేఘన్ టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ అండ్ జే ఆర్ సి (బాయ్స్) హుజూర్నగర్ లోని పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. శశి మేఘన్ ఇటీవల జరిగిన ముంబై రంగు ఉత్సవ కాంపిటీషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ స్థాయి ఆర్ట్ కాంపిటీషన్లో కలరింగ్ స్కెచ్ కార్టూన్ పోలాజ్ హ్యాండ్ రైటింగ్ గ్రీటింగ్ కార్డ్ కాంపిటీషన్లో ప్రథమ బహుమతి పొందాడు. ఈ సందర్భంగా శశి మేఘన్ ను పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సన్మానించి బహుమతిని అందజేశారు. సాయి మేఘన్ మాట్లాడుతూ నేను ప్రథమ బహుమతి పొందడానికి సహకరించిన టీచర్ సురేపల్లి నాగరాజు కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నట్లు తెలియజేశారు. తమ కుమారుడు ఈ బహుమతి పొందడానికి సహకరించిన సూర్యపల్లె నాగరాజుకు మరియు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు శశి మేఘన్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చింతలపాలెం ఏప్రిల్ 2 (ప్రజా జ్యోతి) :- గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన చింతలపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చింతలపాలెం ఎస్సై సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చింతలపాలెం మండలం బుగ్గమాదారం గ్రామ శివారులో బుగ్గ వాగు కృష్ణానదిలో కలిసే చోట గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం వాగు నీటి ఒడ్డున లభించిందని, మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 55 నుండీ 60 సంవత్సరాలు ఉండవచ్చని. మృతుడు చనిపోయి వారం రోజులు అవుతుందని ఎస్సై తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఎవరైనా కనబడకపోయినా, మృతుడి వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే చింతలపాలెం పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని కోరారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలు



మోతె ఏప్రిల్ 2( ప్రజాజ్యోతి ): గౌడజన హక్కుల పోరాట సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కారింగుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గౌడ జన హక్కుల పోరాట సమితి వ్యవస్థపాక అధ్యక్షులు ఎలికట్టే విజయ్ గౌడ్ ఆదేశానుసారం మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ గౌడ్ 314వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా అధ్యక్షుడు కారింగుల శ్రీనివాస్ గౌడ్ సర్ధార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి ఘన నివాళు లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బహుజన వీరుడు సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ బిక్కి బుచ్చయ్య గౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు చెనగాని అంజమ్మ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చౌగాని వెంకటేశ్వర్లు గౌడ్, జిల్లా కార్యదర్శిలు శ్రీ రేసు రాములు గౌడ్, శ్రీ జలగం మల్లేష్ గౌడ్, సూర్యాపేట టౌన్ మహిళా అధ్యక్షురాలు గిలకత్తుల నాగమణి గౌడ్, జిల్లా గౌడ సంఘం నాయకులు శ్రీ పల్స లింగయ్య గౌడ్, శ్రీ అనంతుల ప్రకాష్ గౌడ్, శ్రీ బిక్కి మహేష్ గౌడ్, తదితర గౌడ పెద్దలు పాల్గొన్నారు.



# ఇఫ్తార్ విందులు పుణ్యకార్యాలు

**ముస్లిం ల రంజాన్ మాస దీక్షలు విజయ వంతం కావాలి... కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు తూమాటి**

కోదాడ టౌన్ ఏప్రిల్ 2( ప్రజా జ్యోతి): ఇఫ్తార్ విందులు పుణ్యకార్యాలు అని కోదాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూమాటి వర ప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ మండలం పరిధిలోని ఎర్ర వరం లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ లతీఫ్ అధ్యర్యంలో రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షకులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండు వేసవిలో ముస్లిం సోదరులు చేస్తున్న ఉపవాస దీక్షలు ఆటంకం లేకుండా విజయ వంతం కావాలని ఆకాంక్షించారు.ఇఫ్తార్ విందు ఏర్పాటుచేసిన లతీఫ్ ను అభినందించారు. ముస్లిం సోదరులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు ఇర్ల సీతారామిరెడ్డి , వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, ఉపాధ్యక్షులు వేమూరి మధు, పిపిసిఎస్డైరెక్టర్ సుభాష్,సాగర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా వడ్డెర రాజుల ఎల్లమ్మ జాతర మహోత్సవం

సూర్యాపేట రూరల్ (ప్రజా జ్యోతి ఏప్రిల్ 2): సూర్యాపేట రూరల్ పరిధి బాలెంలలో వడ్డెర కులస్తులు (శివరాత్రి వారు) వారి కుల దైవమైనటువంటి ఎల్లమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది ఉగాది పండగకు రెండు రోజుల ముందు అమ్మవారి పండగ నిర్వహించడం జరిగింది. ఈ సంవత్సరం అమ్మవారికి శివరాత్రి భిక్షపతి (మాజీ ఉపసర్పంచ్ బాలెంల ) జ్ఞాపకార్థం వారి కుమారులు రమణయ్య, శేఖర్, శ్రీనులు శివరాత్రి వంశస్తుల అంగీకారంతో పూజా కార్యక్రమాలు, అలంకరణలు, లైటింగ్, కలర్స్(పెయింటింగ్) పూల డెకరేషన్, ఊరేగింపు డీజే లను ఏర్పాటు చేయించి వారి నాన్నపై, అమ్మవారిపై వారికున్న గొప్ప భక్తిని చాటి చెప్పారు. అలాగే వడియ రాజుల మహోత్సవం సందర్భంగా శ్రీ. రేణుక ఎల్లమ్మ తల్లి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు వెదురు బొంగు బుట్టలతో ఎల్లమ్మ తల్లి బాందివాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ జాతర మహోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పునకాలతో ఊగుతూ నృత్యాలు చేసి ఆడి పాడారు.ఈ సందర్భముగా శివరాత్రి శేఖర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వడియ రాజుల మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేకలు,గొర్రె పోతులను ఊరేగించి మరుసటి రోజు అమ్మవారికి బలి ఇచ్చి జాతర పరిసమాప్తి జరుగుతుంది . ఈ కార్యక్రమము లో శివరాత్రి కుటుంబ వంశస్తులు ,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మండుతున్న ఎండలకు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**డాక్టర్ లక్ష్మీ ప్రసన్న**



అనంతగిరి ఏప్రిల్ 2 (ప్రజా జ్యోతి) : మండుతున్న ఎండలకు వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని వైద్యాధికారి లక్ష్మీ ప్రసన్న అన్నారు. త్రిపురవరం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వడదెబ్బ పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 9 గంటల లోపు కూలి పనులు ముగించుకొని ఇంటికి చేరుకోవాలన్నారు. కూలి పనులు చేస్తున్న ప్రతి ఒక్కరూ వడదెబ్బ తీవ్రతకు అప్రమత్తంగా ఉండాలన్నారు.వడదెబ్బ సోకిన వ్యక్తులు తీసుకోవలసిన జాగ్రతల గురించి వివరించారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులు కారణంగా వడదెబ్బ (సన్ స్ట్రోక్), డీహైడ్రేషన్ వచ్చే అవకాశం ఉందని అన్నారు. సాధారణంగా వచ్చే వ్యాధులు సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. వేసవికాలంలో నీరు, పళ్ళ రసాలు, కొబ్బరినీళ్ళు,మజ్జిగ ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.రోజూ కనీసం 15 గ్లాసుల నీళ్ళు త్రాగాలని పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వటం అవసరమని అన్నారు. ఎండవేళ ఇంటి పట్టునే ఉండాలని అత్యవసర పరిస్థితిలో బయటకు వెళ్లాలనుకునే వారు లేతవర్ణం, తెలికైన, కాటన్ దుస్తులు ధరించాలని అన్నారు. బయటకు వెళ్లే ముందు తన వెంట గొడుగు, టోపి వంటివి తీసుకొని వెళ్లాలని సూచించారు.వేసవిలో, తీవ్ర ఉష్ణోగ్రత సమయంలో ఎక్కువగా తిరగరాదని సూర్యకిరణాలకు,వేడిగాలి తగలకుండా పలు జాగ్రత్తలు పాటించాలన్నారు బయటకు వెళ్ళినప్పుడు రహదారుల వెంట ఉన్న చల్లని రంగు పానీయాలు త్రాగరాదని,కలుషిత ఆహారం తినరాదని మాంసాహారం మద్యం సేవించరాదని అన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చాలని, చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలని, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చేస్తుండాలని,ఫ్యాను గాలి / చల్లని గాలి తగిలేలా ఉంచి,ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిగిన గ్లూగోజు ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణము (ఓ.ఆర్.ఎస్.) త్రాగించవచ్చని అన్నారు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు త్రాగించకూడదని తెలిపారు. వీలయినంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని అన్నారు. గ్రామాల్లో పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులకు సలహాలు సూచనలు అందిస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యులు డాక్టర్ హరినాథ్,ప్రసన్న , సూపర్వైజర్లు కళావతి,సురేంద్ర,విజయ్ కుమార్ కృష్ణమూర్తి,ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# నీటి అక్రమ వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు

**ఆర్డీఓ శ్రీనివాస్**

**కాలువలు పరిశీలించిన అధికారుల బృందం**

మిర్యాలగూడ, ఏప్రిల్ 02,( ప్రజా జ్యోతి): తాగునీటి సమస్యలు తీర్చేందుకు నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు విడుదల చేస్తున్న నీరు అక్రమ వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని మిర్యాలగూడ ఆర్డిఓ జి శ్రీనివాసరావు హెచ్చరించారు.మంగళవారం నాగార్జునసాగర్ ఎడమ కాలువ,వజీరాబాద్, ముల్కల కాల్వ మేజర్లను అధికారుల బృందాలతో కలిసి పరిశీలించారు. నీటి అక్రమ వినియోగం జరగకుండా మండల స్థాయిలో అధికారుల నిఘా బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులోని నల్లగొండ జిల్లా పెద్దదేవులపల్లి, ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్లను నింపి నీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యలలో భాగంగా 3 టీఎంసిల నీటిని ఎడమ కాల్వకు విడుదల చేసేందుకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కాల్వకు సుమారు 5,000క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా పెద్దదేవులపల్లి చెరువుకు చేరుకుంటున్నాయి. పెద్దదేవలపల్లి రిజర్వయిర్ నీటి మట్టం 16 అడుగులు. పూర్తి స్థాయిలో నిండిన అనంతరం దిగువకు పాలేరు చెరువుకు నీటిని తరలిస్తారని, ఎలాంటి ఆటంకాలు లేకుండాపాలేరు చెరువుకు తరలించేందుకు కాల్వ ఉన్న మండలాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపిడిఓ, ఎంపీఓ, పోలీస్, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖల అధికారులతో మండలానికో బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా ప్రారంభించామన్నారు.మిర్యాలగూడ తహసీల్దార్ ఎన్.హరిబాబు, ఎంపిడిఓ ఎం.శేషగిరిశర్మ, ఎంపీఓ పద్మ, పోలీస్ కానిస్టేబుళ్లు,ఆర్డబ్లుఎస్ ఎఇ మౌనికలు మంగళవారం మండలంలోని సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని వజీరాబాద్ మేజర్ నుండి ముల్కలకాల్వ మేజర్ వరకు, కొంత భాగం వేములపల్లి మండలంలో అన్నపురెడ్డిగూడెం నుండి శెట్టిపాలెం గ్రామం వరకు,ముల్కలకాల్వ మేజర్ నుండి తడకమళ్ళ క్రాస్ రెగ్యులేటర్ వరకు మిర్యాలగూడ మండల బృందం పర్యవేక్షించింది. ఆయా మేజర్ కాల్వ తూములు ధ్వంసం చేసి నీరు తీసుకోకుండా పంచాయతీ కార్యదర్శులను మూడు షిఫ్ట్ లలో నిఘా పెట్టారు. ఇదే విధానం అనుముల, నిడమనూరు, త్రిపురారం, నేరేడుచర్ల, గరిడేపల్లి, చిలికూరు, మునగాల, నడిగూడెం మండలాలో కొనసాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



# అన్నదాతకు అండగా బిఆర్ఎస్ ఉద్యమ బాట

**మండల పార్టీ అధ్యక్షులు దొంగరి యుగేందర్**

**ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ లకు బిఆర్ఎస్ శ్రేణుల వినతి పత్రాలు**

**రైతులకు 25 వేల నష్టపరిహారం, రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్**

పెన్ పహాడ్ ప్రతినిధి ఏప్రిల్ 2 (ప్రజా జ్యోతి): పాలకుల నిర్లక్ష్యంతో నిండా మునిగిన అన్నదాతలకు అండగ బిఆర్ఎస్ ఉద్యమం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నేడు ప్రారంభమైందని పెన్ పహాడ్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు దొంగరి యుగెంధర్ అన్నారు.రెండు రోజుల క్రితం మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ పిలుపుమేరకు రైతులను ఆదుకోవాలని, ధాన్యానికి రూ.500 బోనస్, రైతుభరోసా, రైతు రుణమాఫీ హామీలు అమలు చేయాలని కోరుతూ మాజీ మంత్రి ,సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి సారథ్యంలో కలెక్టరేట్ కార్యాలయాల్లో టిఆర్ఎస్ నాయకుడు ప్రజాప్రతినిధులు వినతిపత్రాలు ఇచ్చారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన నేతలు..నీరు, విద్యుత్ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.ప్రభుత్వ అసమర్థత వల్ల లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని చెప్పారు. సర్కార్ అలసత్వం వల్ల జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. నీళ్లున్నా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పొదిల నాగార్జున,ఎగ్గడి మురళి, ఊరుకొండ రాధాకృష్ణ,కొండ జానకిరాములు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న నివాళి

**కేజీకేయస్ సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏలుగూరి గోవిందు,మడ్డి అంజిబాబు**



పెన్ పహాడ్ మండలం ఏప్రిల్ 2 (ప్రజా జ్యోతి): బహుజన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్న 314 వ వర్ధంతిని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల భవనంలో మంగళవారం నాడు వారి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పిస్తూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏలుగూరి గోవిందు,మడ్డి అంజిబాబు మాట్లాడుతూ జానపదుల కథలలో సర్వాయి పాపన్న చరిత్ర బహుళ ప్రచారంలో ఉన్నది శారద కథలు వారు ఇతర జానపదాలు పాపన్న చరిత్రను కథలు పాటల రూపంలో వినిపిస్తున్నారు. వీరి నోళ్లనుంచి వెలబడే కథలు ఆధారంగానే పాపన్న చరిత్ర వెలుగులోకి వచ్చింది కర్ణాటక రాష్ట్రంలోని భళ్లారి ప్రాంతంలో ఒక బోయవాడి పాట ఆధారంగా ప్రముఖ జానపద పరిశోధకుడు ఏజే బోయల్ ద్వారా పాపన్న చరిత్ర ప్రచురియం పొందింది అనేకమంది పరిశోధకులు మరింత లోతుగా అధ్యయనం చేసి ఆధారాలను సేకరించారు లండన్ లోని విక్టోరియా ఆల్బర్ట్ మ్యూజియంలో సర్వాయి పాపన్న ఒక చేతిలో రామచిలుక మరో చేతులు పొడవటి బల్లెంతో సేద తీరుతున్న చిత్రం ఉన్నది లండన్ లోని కేం బ్రిడ్జి యూనివర్సిటీ రిచార్టు ఎం ఈటన్ వ్రాసిన ఏ సోషల్ హిస్టరీ ఆఫ్ దక్కన్ ఎయట్ ఇండియన్ లీవ్స్ అనే పుస్తకం ప్రచురించింది పాపన్న చిత్రాన్ని ప్రచురించారు. కాకతీయల పాలన అంతమై 300 ఏండ్ల తర్వాత క్రి:శ 1650 నుంచి 1709 వరకు పాపన్న ప్రస్తావం కొనసాగింది క్రి:శ 1650 ఆగస్టు 18న ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రస్తుతం జనగాం జిల్లా స్టేషన్ ఘన్పూర్ మండలం తాటికొండ లో గౌడ కుటుంబంలో జన్మించాడు బతుకుతెరువు కోసం పాపన్న పశు వులుగాస్తు తన తల్లిదండ్రులు సర్వమ్మ కోరిక మేరకు కలుగిస్తూ వృత్తిని చేపట్టాడు మొగలు చక్రవర్తుల పాలనలో రాజ్యాధికారం కోసం కు. హత్యలు అంతర గత కుమ్ములాటలు కొనసాగుతున్న తరుణంలో గ్రామ అధికారులుగా ఉన్న పౌజుదారులు అధికారులు ప్రజలను ఎన్నో విధాలుగా ప్రజలు పీడించేవారు ఈ ప్రాంతంలో అణగారిన వర్గాల జీవనం దుర్భంగా మారింది పన్నులు వ్యక్తి విధానంతో శ్రమదోపిడి నిరంతరం సాగిస్తూ వచ్చింది.ఈ పరిణామాలుని పాపన్న పై ప్రభావం చూపాయి.తన కుటుంబ జీవనం విధానం ఆనాటి సాంఘిక ఆర్థిక రాజకీయ పరిస్థితులు పాపన్న రాజ్యం వైపు నెట్టివేశాయి తన సవాసగాళ్లు చాకలి సర్వనా మంగలి మాసన్న కుమ్మరి గోవిందు జక్కుల పెరుమాళ్ళు దూదేకుల పీరు కొత్తవల మీరు సాహెబ్ వంటి ప్రధాన అనుచరులతో సమావేశంలో చేశాడు సమరానికి పూనుకున్నాడు తన తల్లి దాచిన సొమ్ముతో ఆయుధాలను సమకూర్చుకున్నాడు ధనవంతుడు దగ్గర ఉన్న ధనాన్ని కొల్లగొట్టి పేదలకు పంచాడు 1675 ప్రాంతంలో కరీంనగర్ జిల్లా సర్వాయి పేటలో 1698లో ప్రాంతంలో తాటికొండలు 1700 నుండి 1705 వరకు ఆ ప్రాంతంలో ఖిలాష్ పురం కోటను నిర్మించి పాలన సాగించాడు తాటికొండ నుంచి ప్రారంభమైన పాపన్న ప్రస్థానం ఆనాటి నల్లగొండ బోనగిరి సర్కార్ నేడు జనగాం జిల్లా ఖిలాసపురంలో నిర్మించి కోటను కేంద్రంగా చేసుకొని తెలంగాణ అంతా విస్తరించింది క్రి:శ 1708లో వరంగల్ కోటను భువనగిరి కోటలను ఆక్రమించాడు క్రీస్తు 1709 ఆరంభంలో గోల్కొండ కోటను జయించాడు సుమారు 30 సంవత్సరాలు పాలన చేశాడు ప్రజలందరి చేత సర్దార్ అనిపించుకున్నాడు పాపన్న నిర్మించుకున్న కోటాలో సర్వాయిపేట తాటికొండ ఖిలాష్ పురం ఆక్రమించిన కోటలను వరంగల్ కోట బోనగిరి కోట లాంటివి నేటికీ సజీవ సాక్షిగా మన కండ్ల ముందు కనిపిస్తున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గునగంటి కృష్ణ జిల్లా సహాయ కార్యదర్శి ఉయ్యాల నగేష్ జిల్లా బోడ సైదులు సంఘం నాయకులు చికూరి ప్రకాశం బొమ్మగాని వెంకన్న బత్తిని సైదులు దేశగాని వెంకటరాములు ఎలుగూరి రామ్మూర్తి ఆల్దాస్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు

## ఆశ వర్కర్లు ప్రజల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలి

**డాక్టర్ వై నాగరాజు**

మోతె ఏప్రిల్ 2(ప్రజా జ్యోతి ): మోతె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లకు మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు.ఆశ వర్కర్లు క్లుప్తంగా ఆరోగ్యం పట్ల అవగాహనను ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని కల్పించాలని డాక్టర్ వై నాగరాజు అన్నారు. అనంతరం అయన మాట్లాడుతూ.... ఆశ వర్కర్లలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి తేలికపాటి దగ్గు, జ్వరం, జలుబు తదితర చిన్నపాటి వ్యాధులకు కూడ మందులు అందజేయాలని తెలిపారు. ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ రోగాల కట్టడికి చర్యలు చేపట్టాలని. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి డెలివరీ వరకు ప్రతినెలా వారికి సూచనలు చేస్తూ సాధారణ ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలన్నారు. దీంతో సర్కారు వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య రెండింతలు పెరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ టి. సీతారాం నాయక్ , ఎంపీడీవో జి. హరిసింగ్, వైద్య సిబ్బంది ఎం. సీత పి హెచ్ ఎన్ కమలమ్మ, ఎంపీ హెచ్ ఎస్, ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## మండలంలో ఐదు పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా గుర్తింపు

**ఎంపీడీవో వెంకటేశ్వరరావు**





పెన్ పహాడ్ ప్రతినిధి ఏప్రిల్ 2 (ప్రజా జ్యోతి): ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు,పాఠశాల కమిటీ చైర్మన్ లకు ఎంపీడీవో జన్జనాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది.ఈ వర్క్ షాప్ లో ఎంపికైన 32 పాఠశాలల్లో మొదటి విడతగా ఐదు పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా గుర్తించి ఈ ఐదు పాఠశాలల్లో పనుల గుర్తింపు ఎస్టిమేషన్ చేయడము పనులు ప్రారంభించి ఏప్రిల్ 15లోగా ఈ ఐదు పాఠశాలలకు మౌలిక వసతుల కల్పన, ఆహ్లాదకరమైన వాతావరణం అన్ని వసతులు ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు తయారుచేసి పనులు ప్రారంభించడానికి ఈ వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది.సంబంధిత ప్రధానోపాధ్యాయులు కమిటీ చైర్మన్ ల సమక్షంలో ఈ పనులు జరగాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా సివిల్ సప్లై అధికారి మండల స్పెషల్ ఆఫీసర్ రాములు, ఎంపీడీవో వెంకటేశ్వారావు ఎంఈఓ నకిరేకంటి రవి, పిఆర్ఏఈ కిరణ్ కుమార్ ,ఎపిఎం అజయ్ , ఎం పి ఓ నరేష్ వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కమిటీ చైర్ పర్సన్లు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి



పెన్ పహాడ్ ప్రతినిధి ఏప్రిల్ 2 (ప్రజా జ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూర్యాపేట జిల్లా సివిల్ సప్లై అధికారి మండల స్పెషల్ ఆఫీసర్ రాములు, కార్యదర్శులతో తాగునీటి సమస్య గురించి సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,అన్ని గ్రామాలలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పాడైపోయిన హ్యాండ్ పంపులను చేతిపంపులు రిపేర్ చేయించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీ రాములు ఆర్ఎస్ డబ్ల్యు ఏఈ శ్రీనివాస్ ,ఎస్ఐ పెరిక రవీందర్, ఎంపీఓ నరేష్ ,డిటి లాలు నాయక్ ఎంపీడీవో జంజనాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఐకెపి సెంటర్లను ప్రారంభించిన ఎంపీడీవో ఏపీఎం



మోతె ఏప్రిల్ 2( ప్రజాజ్యోతి ): మంగళవారం మండల పరిధిలోని కొత్తగూడెం, విభలాపురం, ఉర్లుగొండ, రావిపహాడ్,బుర్కచర్ల గ్రామలలో ఐకెపి సెంటర్లను ఎంపీడీవో హరిసింగ్ ఏపీఎం వెంకయ్యలు ప్రారంభించారు అనంతరం వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రతి క్వింటాకు మొదటి రకం ధాన్యం ధర 2203 రూపాయలు రెండవ రకం ధాన్యం ధర 2183 రూపాయలుగా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీసీ శ్రీనివాస్, సంఘ బంధం అధ్యక్షురాలు సంపూర్ణ, వి.పద్మ, కట్ల.ఉమా, వీబీకే



మణెమ్మ,డి.గురు స్వామి, కళగాని రజిత, కోశాధికారి సిహెచ్.కవిత,ఎ. అశ్విని, పుల్లి.నాగమణి, కార్యదర్శులు. పూలమ్మ, లంజపల్లి నాగమణి, విలేజ్ సెక్రటరీ కవిత రైతులు హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి డిపిఓ సురేష్ కుమార్



మఠంపల్లి ఏప్రిల్ 02 ప్రజా జ్యోతి: మఠంపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని దానికి తగ్గట్టుగా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, శానిటేషన్ ఇతర అంశాలపై మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల కార్యదర్శులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా పంచాయతీరాజ్ అధికారి సురేష్ కుమార్ ఆయా గ్రామాల అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డిఎల్పిఓ యాదగిరి, మండల స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి, మఠంపల్లి మండల ఎంపీడీవో జానకిరాములు,ఎంపిఓ ఆంజనేయులు మరియు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సెల్ఫీతో ఆత్మహత్యాయత్నం - వాట్సాప్ గ్రూపులో వీడియో వైరల్



మునగాల,ఏప్రిల్ 2 (ప్రజా జ్యోతి): మునగాల మండల కేంద్రానికి చెందిన గడ్డం వెంకటేష్(25) మంగళవారం తన మొబైల్ కెమెరాతో సెల్ఫీ వీడియో తీసుకుంటూ క్రిమిసంహారక మందు(సిటార దోమల మందు) తాగుతూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పూర్తి వివరాల్లోకెళ్తే మునగాల మండల కేంద్రానికి చెందిన గడ్డం సైదులు చిన్న కుమారుడు వెంకటేష్ వృత్తిరీత్యా వ్యవసాయం చేస్తూ తండ్రికి చేదోడు చేదోడుగా ఉంటుంటాడు. ఇరుగుపొరుగు వారు తెలిపిన సమాచారం ప్రకారం మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఒంటరిగా స్థానిక ఫస్ట్ లిఫ్ట్ బాయి దగ్గరకు వెళ్లి తన సొంత కెమెరాతో సెల్ఫీ తీసుకుంటూ క్రిమిసంహారకమందు సేవించి అనంతరం ఆ వీడియోను వాట్సప్ లో సెండ్ చేశాడు. ఆ వీడియో విషయం తెలిసిన కుటుంబ సభ్యులు హుటాహుటిన వెంకటేష్ ను వైద్య చికిత్స నిమిత్తం కోదాడకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. వెంకటేష్ ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన వీడియో పలు వాట్సప్ గ్రూపులలో వైరల్ గా మారింది.

## క్రీడల్లో పోచంపల్లి ఖ్యాతిని పెంచాలి

**పద్మశాలి సంఘం జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు తడక రమేష్**

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 02 (ప్రజాజ్యోతి): ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించి పోచంపల్లి ఖ్యాతిని మరింత పెంచాలని పద్మశాలి సంఘం జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు తడక రమేష్ అన్నారు. పట్టణ కేంద్రంలోని పద్మశాలి యువజన సంఘం అధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేత చందు సూపర్11 ఘట్కేసర్ రెండవ బహుమతి జాలల్ పూర్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు తడక రమేష్ హాజరై విజేతలకు బహుమతి ప్రధానం నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భోగ భానుమతి విష్ణు పద్మశాలి యువజన సంఘం గౌరవ సహలదారులు వనం వెంకటేశ్ గౌరవ అధ్యక్షులు అధ్యక్షులు సూరపల్లి రాము, పలాధి యాదగిరి మంగళంపల్లి రాజా రమేష్ అంకం పాండు పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గంజి యుగెందర్ ఉపాధ్యక్షులు రుద్ర చందు ప్రధాన కార్యదర్శి అడేపు అరవింద్ సహాయ కార్యదర్శి అటిపాముల దర్మెందర్ కోశాధికారి,సూరపల్లి జగదీష్, మధినాల మహేష్,ఎలే శివశంకర్,చిలువెరు ఉదయ్,ముషం శ్రీనివాస్,బింగి భాస్కర్,భోగ సాయి తేజ మరియు జినుకల జయసూర్య,పాలది సాయి,గంజి నరేందర్ పాల్గొన్నారు.



# పురాతన శిఖర గోపురం ధ్వంసం





హాలియా,ఏప్రిల్2(ప్రజా జ్యోతి) : అనుముల మండల పరిధిలోని పేరూరు గ్రామంలోని శ్రీ స్వయంభు సోమేశ్వర స్వామి దేవాలయంలోని శిఖరం మీద ఉన్న గోపురం గత రెండు సంవత్సరాల క్రితం గుడి నిర్మాణ నిమిత్తం గోపురాన్ని క్రిందకు దించి పక్కన పెట్టారు.ఇట్టి గోపురంను ఏడాది క్రిందట కొందరు దుండగులు ధ్వంసం చేయడం జరిగిన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు దేవాలయ ప్రాంగణం నుంచి 500 మీటర్ల దూరం గోపురాన్ని తీసుకెళ్లి పగలగొట్టి దుండగులు పడవేయడం జరిగిందని హాలియా ఎస్సై బి.సతీష్ రెడ్డి తెలిపారు.దేవాలయ చైర్మన్ రిక్కల కొండారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం డైరెక్టర్లు నరసింహ, యడవల్లి సునీత రాంబాబు,పురోహితులు రాకేష్ శర్మ,సాంబయ్య,గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



## అన్ని దానాల కన్నా గొప్పదనం రక్తదానం

కోదాడ రూరల్ ఏప్రిల్ 02: (ప్రజా జ్యోతి) : అన్ని దానాల కన్నా గొప్పదనం రక్తదానం,రక్తదానం చేయండి మరి ఒకరికి ప్రాణదాతలుగా నిలబడండి అని ఎంబిఎం ట్రస్టు సభ్యులు అన్నారు.మంగళవారం కోదాడ సిటీ హాస్పిటల్ లో మిరియాల రమాదేవి కోదాడ వారికి అత్యవసరంగా ఏ పాజిటివ్ బ్లడ్ అవసరం అని డాక్టర్ చెప్పడంతో తెలుసుకున్న ఎంబిఎం గ్రూప్ సభ్యులైన కోదాడ కొమరబండ కు చెందిన మంద నాగేంద్రబాబు వారికి బ్లడ్ ఇచ్చి ప్రాణదాతగా నిలిచారు.ఈ సందర్భంగా గ్రూపు సభ్యులు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకు ఎంతోమందికిఎంతో మందికి రక్తాన్ని అందించి ప్రాణదాతగా నిలుస్తున్నా మని తెలిపారు.రాబోయే రోజులలో ఈ ట్రస్టు ద్వారా ఎంతోమందికి రక్తం అందించడానికి సహకరిస్తున్న గ్రూపు సభ్యులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.మంద నాగేంద్రబాబు ఇప్పటివరకు ఎంబీఎం ట్రస్టు ద్వారా ఐదుసార్లు బ్లడ్ ఇవ్వడం జరిగిందని వారికి ఎంబిఎం ట్రస్టు సభ్యుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటివరకు ఈ ట్రస్ట్ కు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ట్రస్టు తరఫున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంబిఎం ట్రస్ట్ సభ్యులు మాతంగి సురేష్,ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్మగూడెం గ్రామంలో నివసించే చౌడోజు పుల్లమ్మ ని పరామర్శించి ఆర్థిక సహాయం

**అందజేసిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి**

పెద్దవూర ఏప్రిల్ 2 ( ప్రజా జ్యోతి )మండలంలోని, వెల్మమ గూడెం గ్రామ వాస్తవ్యులు అయినటువంటి చౌడోజు పుల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని వారిని,వారి భర్త కృష్ణయ్యని పరామర్శించి ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం చేసిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి వీరితో ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ మండలం వైస్ యంపిపి యడవల్లి దిలీప్ రెడ్డి,మాజీ యంపిపి, మాజీ తిరుమలనాథ గుడి చైర్మన్ బుర్రి రామిరెడ్డి,షేక్ ముస్తాఫ,కున్ రెడ్డి సంతోష్ రెడ్డి,ఇస్రం లింగస్వామి,గజ్జల శివానంద రెడ్డి,వంగాల భాస్కర్ రెడ్డి,గజ్జల నాగార్జున రెడ్డి, రామకృష్ణారెడ్డి, కోటి, అనిల్,కోడుమూరి నారాయణ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

